# స్ఫూర్తి

నేను వెళ్లేసరికి శవాన్నింకా తీసుకెళ్లలేదు. హైదరాబాదు నుంచి పడుతూ లేస్తూ వచ్చినందుకు కడచూపు దక్కింది.

"చంద్రం వచ్చేశాడు. తదుపరి కార్యక్రమం మొదలు పెట్టేయండి. పాపం ఎవరూ ఇన్ని కాఫీ నీళ్లు కూడా గొంతులో పోసుకోలేదు" తొందర పెట్టారొకరు.

మావయ్య నిర్జీవమూర్తిని సమీపించాను. చైతన్యంతో జీవనదిలా వుండే మావయ్య ఇప్పుడు ఎండి, బీటలువారిన నేలలా వున్నాడు!

మనిషిలోంచి పచ్చని చిలుక ఎగిరిపోతే మిగిలేది తోలు కప్పిన ఎముకలగూడే. అది తెలీక ఏదేదో బావుకోవాలని ఎంతెంతో నొల్లుకోవాలని తాపత్రయపడుతూంటాం.

పూలదండవేసి కాళ్లకి నమస్కరించి అత్త దగ్గరికెళ్లాను. బావురుమంది. ఓదార్చడానికి మాటలు దొరకలేదు.

"అసలిలా ఎలా అయ్యిందిరా. ఆ మధ్య చూసినప్పుడు బాగానేవున్నాడే" మావయ్య గారబ్బాయి రవిని అడిగాను.

"రోగం రొష్టూ ఏం లేవు. చెట్లూ పుట్టలూ అంటూ తిరుగుతున్న మనిషే. నిన్నరాత్రి అన్నం తిని పడుకున్నారు. అంతే. మరి లేవలేదు" కళ్లు తుడుచుకున్నాడు.

"మంచివాణ్ణి మరణమందు చూడమన్నారు. మంచివాడు గనుకే సునాయాస మరణం లభించింది. అదృష్టవంతుడు!" ఓ ముసలాయన అన్నాడు. ఆ మాటల్లో తనకలాంటి భాగ్యం వుందో లేదోనన్న దిగులు వుంది.

శవానికి స్నానం చేయించారు. బొట్టు పెట్టారు. కొత్తబట్టలు కప్పారు. సిద్ధంచేసిన పాడె ఎక్కించారు.

'నారాయణ' అంటూ శవయాత్ర మొదలైంది.

ఊరంతా కదలి వచ్చింది. ఎంతైనా పల్లెల్లోని కలిసికట్టుతనం, అభిమానమూ వేరు.

మౌనంగా అనుసరిస్తున్నాను. మావయ్య తాలూకు జ్ఞాపకాలు మదిలో ప్రాణం

పోసుకున్నాయి.

మావయ్య అదో తరహా మనిషి. ప్రతిదానికీ నీతీ రీతీ అంటూ అడ్డంపడేవాడు. మేం 'సుమతీ కారుడు' అని చాటుగా పిలుస్తూ హేళనగా నవ్వుకునేవాళ్లం.

పెద్దతోట మధ్య చిన్న తాటాకుల ఇల్లు కట్టుకున్నాడు. పెద్దమేడ కట్టుకోగల శక్తి వుంది. అయినా కట్టలేదు. మొండిమనిషి. బుద్ధి వున్నవాడెవడూ అలా చెయ్యడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. చిన్నప్పుడు మేం ఆడింది, పాడింది, అట్టకిరీటాలు పెట్టుకుని నాటకాలేసిందీ ఆ తోటలోనే.

కోతికొమ్మచ్చి ఆటలు ఎన్నిసార్లు ఆడామో లెక్కలేదు. కొమ్మలు విరుగుతాయంటూ మావయ్య కర్రతీసుకుంటే అందకుండా పారిపోయే వాళ్లం.

మామిడికాయలు, ఉసిరికాయలు ఎన్ని తిన్నామో..... ఎందరికి పంచామో చెప్పలేను!

బడికెళ్తున్న రోజుల్లో కాగితాలమీద బొమ్మలు గీస్తూ చించి పారేస్తోంటే మావయ్య ఊరుకునేవాడు కాదు. పలకమీద ప్రాక్టీసు చేసుకోమనే వాడు. ఓసారేకంగా నాపరాయిమీద నామసుద్దతో రాయింపించాడు. చాదస్తపు మనిషి!

నాలుగైదేళ్ల క్రితం సిటీలో చక్కని బిల్డింగు కట్టాను.

'ఎలివేషన్ బావుంది. మార్బుల్స్ బావున్నాయి. వాస్తూ బాగా కుదిరింది. లొకేషన్ అద్భుతం' అన్నారు గృహప్రవేశానికొచ్చిన అతిథులు.

మావయ్యా వచ్చాడు. ఆయనకవేమీ పట్టలేదు. ఇంటిని చూస్తూనే చప్పరించేశాడు.

"స్త్రీకి బొట్టు ఎలాగో ఇంటికి చెట్టు అలారా. ఇల్లు కొంచెం వెనక్కి కట్టుకుని నాలుగు చెట్లు నాటివుంటే బావుండేది. ఇప్పుడైనా ఫర్లేదు. గోడప్రక్కన మామిడి మొక్కా వేపమొక్కా నాటెయ్. మామిడి చెట్టు నీడనీ, ఫలాన్నీ ఇవ్వడమే కాదు ప్రతి శుభకార్యానికీ పచ్చని ఆకులిస్తుందిరా. వేపగాలి ఆరోగ్యానికి ఎంతో మంచిది....." అన్నాడు!

ఆయన ధోరణికి నవ్వాలో ఏడవాలో తెలీలేదు. ఇక్కడ గజం స్థలం రేటు వేలల్లో ఉందని, కారు పార్కింగు అత్యవసరమనీ ఆయనకి తెలిస్తే కదా!

నిన్నగాక మొన్న మానాన్న చనిపోయినప్పుడొచ్చాడు. అందర్లోనూ అదోలా మాట్లాడి పలచనయ్యాడు. ఎవరూ పైకి నవ్వలేదుగాని లోలోపల బాగా నవ్వుకునే వుంటారు. జోకులేసుకునీ వుంటారు!

మా నాన్న లివర్‌పాడై మరణించారు. దానికో తీగ లాగాలని చూశాడు.

"మీ నాన్న ఆరోగ్యం మాదొడ్డదిరా. చద్దన్నం తిని పెరిగిన రైతుబిడ్డ. ఇక్కడికొచ్చాకే తేడా వచ్చింది. నీదగ్గరికొచ్చి నాలుగైదేళ్లు అవ్వలేదూ? మీరు తాగుతున్న నీళ్లు, పీలుస్తున్న గాలీ పరీక్షింపజెయ్యటం మంచిదిరా చంద్రం" అన్నాడు.

సిటీలో చక్కని మంజీరా వాటర్ని మున్సిపల్ కార్పోరేషన్ అందిస్తోందని ఆయనకి తెలిసుంటే అలా అనేవాడు కాదు.

అంతటితో ఆగివుంటే బాగానే వుండేది.

శవదహనానికి హిందూశ్మశానవాటికకి తీసుకెళ్లాం. అదే సమయంలో మరో రెండు కాష్టాలూ కాల్తున్నాయి. వాటినీ, మేం తెప్పించిన కట్టెల్నీ చూసి లబలబలాడాడు.

"శవాన్ని కట్టెల్తో కాల్చడం ఎందుకురా? ఈ రోజుల్లో కూడా ఇలా కాలుస్తూపోతే రోజుకెన్నివేల చెట్లు నేలకూల్తాయో ఆలోచించు. పంచభూతాల్లో కలిసిపోయే శవం కోసం పచ్చని చెట్లు నరకడం అమానుషం. నామాట విని దీన్నాపు. ఎలక్ట్రిక్ క్రిమెటోరియంకి తీసుకెళ్దాం"

"భలేవాడివి మావయ్యా. తలకొరివా పెట్టొద్దూ?" పిచ్చోడ్ని చూసినట్టు చూస్తూ అన్నాను.

"దానికీ మార్గముందిరా. తలక్రింద ఇంత కర్పూరం పెట్టిదాన్ని ముట్టించేక క్రిమెటోరియంలోకి పంపించెయ్యొచ్చు......" అడ్డుపడుతూ అన్నాడు.

అంతా మా వంక చిత్రంగా చూస్తున్నారు.

"మరీ ఇంత చాదస్తం పనికిరాదు. నలుగుర్తోబాటే నారాయణ అన్నారు. నలిగిన తోవలో నడవకపోతే నలుగురూ నవ్వుతారు....."

"ఎవరో నవ్వుతారని మంచిపని ఆరంభించడం మానేస్తామా చెప్పు? ఇవాళగాకపోతే రేపు వాళ్లు సత్యం గ్రహిస్తారు. ఈ నవ్వినవాళ్లే రేపు అనుసరిస్తారు....." ప్రాధేయపడ్డాడు.

కోపాన్ని విసుగ్గా మార్చుకుని ఆయన్ని ప్రక్కనుండమన్చెప్పి పక్కనపెట్టేసి దహన కార్యక్రమం పూర్తిచేశాం.

కన్నీళ్లు పెట్టుకున్నాడాయన.

చిత్రమైన మనిషి!

అదంతా గుర్తొచ్చి నా పెదాలమీద చిరునగవు మొలిచింది. అది సందర్భం కాదన్పించి మ్రింగేసాను.

పొలిమేరలో శవాన్ని దింపి కత్తితో గీతలు గీసి మళ్లీ పాడెని లేపారు.

దింపుడు కళ్ల ఆశ! కొనఊపిరి మిగిలి వుందేమోనని పిసరంత ఆశతో చేసే పరీక్ష!

శ్మశానానికెళ్లాం!

పిడకలరాశి తప్ప కట్టెలెక్కడా కన్పించలేదు.

"కట్టెలింకా తేలేదేం? చెట్టుని కొట్టడం పూర్తవలేదా?" కజిన్ బ్రదర్ని అడిగాను.

"కట్టెని కట్టెల్తో కాల్చడం మా ఊళ్లో మానేశాం" తుళ్లిపడ్డాను. చిత్రంగా చూశాను. చిన్నగా నవ్వేను.

"మరెలా కాలుస్తారు? ఆ పిడకల్తోనా?"

నా స్వరంలో కించిత్తు హేళన కన్పించింది కాబోలు చురుక్కుమని చూశాడు.

"పెద్దచదువులు చదివిన వాడివి. నువ్వలా మాట్లాడతావేంటన్నయ్యా...."

పచ్చివెలక్కాయ గొంతులో పడింది.

"ఇదివరకు ఊళ్లో ఒక ప్రాణంపైకిపోతే ఒక చెట్టు నేలకూలేది. ఇలా నరుక్కుంటూపోతే భూమ్మీద చెట్టంటూ మిగలదని మావయ్య అడ్డుపడ్డాడు. పెద్దవాళ్లకి నచ్చలేదుగాని మా కుర్రాళ్లకి బాగా నచ్చింది. ఇంకోదారి చూడమన్నాం. పిడకల్తో కాలుద్దామన్నాడు. పెదవి విరిచేశారంతా...."

ఆసక్తిగా చూసాను.

"ఆవుపేడతో చేసిన పిడకల్తో శవాన్ని కాలుద్దామని ప్రతిపాదించాడు మావయ్య. అది పవిత్రదహనమవుతుందని, హిందువులకెంతో పుణ్యదాయకమనీ చెప్పేడు. ఆ పాయింటు అందరికీ నచ్చింది. గోపంచకాన్నీ గోమయాన్నీ శుద్ధికార్యక్రమాలకు ఉపయోగిస్తాం కదా. అలాగే ఇది పాపశుద్ధికి ఉపయోగిస్తుందన్నారు కొందరు. ముక్తిదాయకం అన్నారింకొందరు. ఏమైతేనేం ఊరంతా అంగీకరించింది. అదిగో అప్పట్నించి మావయ్యమాట బాట పట్టింది ఊరు...."

నిశ్చేష్టుడ్నయ్యాను. ఒక్కసారి వెనుదిరిగి చూశాను....

చాదస్తం అంటూ నేను త్రోసిపుచ్చిన మామయ్య ప్రతిమాట వెనుక ఒక అర్థం

కన్పించింది! మరేదో పరమార్థం విన్పించింది!

ఆయన అదో తరహా మనిషికాదు దార్శనికుడు!

పిడకల చితిమంటల్లో మావయ్య పార్థివ శరీరం కాలుతోంది.

నాకు మాత్రం ఆయన చాటిన సూక్తులు నిప్పులో కాలి సత్యాలుగా నిగ్గుతేలుతున్నట్టు అన్పించింది.

అప్రయత్నంగా చేతులు జోడించాను.

**(కథాకేళి మార్చి 2013)**